# పాలకోవా

చందుసోంబాబు



ప్రేమికులకి ప్రేమ పాలకోవాలా కనిపిస్తుంది. ప్రేమికుల ప్రేమ వాళ్ళ తల్లిదండ్రులకి వేపకాయ నమిలినట్టుగా ఉంటుంది.

నిక్కర్లు మానేసి ఫాంటు తొడుక్కోడం వచ్చేసరికి పక్కింటి గోడో, ఎదురింటి గోడో దూకి ఆ ఇంట్లో అప్పుడే పరికిణీ, ఓణీలు వేసుకోడం మొదలుపెట్టిన పిల్లని దొంగచాటుగా వాటేసుకొని ముద్దు పెట్టుకోవా అనిపిస్తుంది.

పచ్చని కొబ్బరి మట్టలమీద కూర్చోబెట్టగానే తన ఇంటిచుట్టూ పోలీసు కుక్కలా ఈల వేసుకుంటూ తిరిగే ఆ పేట అందగాడు గుర్తుకొచ్చి అతనెందుకు అలా తిరుగుతున్నాడో అర్థమైపోయి ఒళ్లంతా సిగ్గుమొగ్గలై వయ్యారాలు పోతుంది ఆ బేబి.

బాత్‌రూంలో స్నానం చేస్తూ సబ్బు బిళ్లతో ఒళ్ళు రుద్దుకుంటూ, కూనిరాగాలు తీస్తూ తన శరీరంపైన రూపుదిద్దుకున్న కొత్తఅందాలని పొగరుగా, వగరుగా చూసుకొని పక్కింటి బాబీగాడితో అభిషేకం చేయించుకోవా అనిపిస్తుంది,

ఇలాంటి పిచ్చి ఆలోచనలు ఆడపిల్లక్కలగకూడదని ఆ ఇంట్లో బామ్మో, మామ్మో వెయ్యి కళ్లతో కనిపెట్టుకొని ఉంటుంది. బడికితప్ప గుడికెళ్లినా, సిన్మాకెళ్ళినా వృద్ధ పిశాచాల్లా వెంటొస్తారు.

తనిష్టపడే పిల్లని ఆకర్షించడానికి బాబిగాళ్లు, బుజ్జిగాళ్లు పడే అవస్థ మరోవిధంగా ఉంటుంది. సొంత సంపాదన ఉండదు కనుక ఇంటి పనుల్లో కమీషన్ కొట్టి, ఆ కమీషన్ డబ్బుల్ని స్నేహితులకి ఖర్చెట్టి తన ప్రేమ కథసపోర్ట్‌కోసం గ్రూపు తయారుచేసుకొంటాడు ప్రేమికుడు. ప్రేమించిన పిల్ల ఇంటి చుట్టూ గానుగెద్దులా తిరిగి 'తూ కహో, మై బతా!' అని ఈలపాట పాడతాడు. అది విని ఆ బేబీ కోపగించుకుంటుంది. మొహం చిటపట లాడిస్తుంది. అయితే నాలుగు రోజుల తర్వాత ఆ పాట వినబడకపోతే బేబీకి తలనొప్పి వస్తుంది. అతను కనబడకపోతే జ్వరమొస్తుంది.

ఆ విరహం తర్వాత బుజ్జిగాడ్ని చూసి కిటికీలోంచి కాగితం ఉండని విసిరేస్తుంది. అందులో సినిమాకి రమ్మని రాస్తుంది.

బుజ్జిగాడు స్నేహ బృందంతోనూ, బేబీ బామ్మతోనూ వస్తుంది. అక్కడ మాట్లాడుకోడానికి వీలుండదు కనుక చూపుల బాణాలతో ఒకర్నొకరు బాదేసుకుంటారు. ఆఖరికి ఓ చెట్టుదగ్గర కలుసుకుంటారు.

"ఈ చెట్టు సాక్షిగా నిన్ను చూడకుండా ఉండలేకపోతున్నాను బేబీ!" అంటాడు బుజ్జిగాడు.

"నువ్వు కనబడకపోతే ఈ జీవితమే వ్యర్థం బుజ్జీ" అంటుంది బేబి.

"మనది అమరప్రేమ",
"కాదు పవిత్ర ప్రేమ"!

బుజ్జి మిరపకాయ బజ్జీలు కొనుక్కొస్తాడు. అవి తింటూ బేబి—

"నీకు చదువు పూర్తికాలేదని విచారించకు. మన బ్రతుకు మనం బ్రతగ్గలం. ఏదన్నా వూరు చెక్కేసి మిరపకాయ బజ్జీల వ్యాపారం చేసుకొందాం! అంటుంది బేబీ! నువ్వు బజ్జీలు వేసిస్తే నేను అమ్మేస్తాను!

ఎలాగూ బజ్జీల వ్యాపారం ఉండనేవుంది కదా అని బేబీ మోజులో పరీక్ష డింకీ కొట్టిస్తాడు బుజ్జిగాడు. బుజ్జిగాడు రెపరెపలాడిపోడం చూసి

అవ్వూరినుంచి మరో ఊరు పంపేస్తాడు కన్నతండ్రి భోరునఏడ్చి.

'పిల్ల కాలు జారలేదు. జారింది నోరే కనక సంతోషించి బేబీకి ఓ వెంకట్రావునో, సుబ్బారావునో తెచ్చి పెళ్లిచేసేస్తుంది బామ్మగారు.

తర్వాత పెళ్లయినా బేబి జాగ్రత్తగా ఉండాలనుకున్నా బుజ్జిగాడి జ్ఞాపకాలు ఆమెని వేధిస్తుంటాయి.

ఎప్పుడో ఎక్కడో బుజ్జిగాడు తారసపడతాడు. 'ప్రేమ పాలకోవా అంటాడు. నీ జ్ఞాపకాలతో చచ్చిపోతున్నానంటాడు. మిగిలిపోయిన కోరికని తీర్చమంటాడు. రుణం మిగిలి ఉండకూడదంటాడు'.

బేబీ ఏంచేయాలి?

ఒక్కసారి చనువిస్తే అలవాటుగా మారిపోతుంది. కాదంటే పెళ్లికి ముందే బేబితో తనకి సంబంధం ఉందని అల్లరిచేస్తాడు.

అయ్యా, ఇదీ సార్ కథ!!?

లోకజ్ఞానం లేని చిన్నవయసులో వాళ్లు పాలకోవాలా భావించే ప్రేమ కాలకూటవిషమని అప్పుడు తెలీదు.

అది కాలసర్పంలా కాటేస్తుంది.

కబడ్దార్!

*